సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



23 నుంచి బాబయ్య ఉత్సవాలు

పెనుకొండలో ప్రసిద్ధ బాబయ్య దర్గా ఉత్సవాలు ఈ నెల 23న ప్రారంభం కానున్నాయి.

8లో



టమాట కిలో రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
29.4°/18.8°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

దూరవిద్య యూజీ ఫలితాలు విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య యూజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ శనివారం విడుదల చేశారు. బీఏలో మొత్తం 157 మంది రాయగా, 114 మంది (72.61 శాతం), బీకాంలో 44 మందికి గాను 22 మంది (50 శాతం), బీకాం కంప్యూటర్స్/బీబీఏలో మొత్తం 148 మందికి గాను 103 మంది (69.59 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వచ్చే జనవరి 6న రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రీవాల్యుయేషన్‌కు సంబంధించి ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున ఫీజు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల టీచర్లకు ప్రత్యేక శిక్షణ

కదిరి: పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల్లో ఫిజిక్స్, బయాలజీ, గణితం బోధించే ఉపాధ్యాయులకు త్వరలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా 520 ఉండగా, అందులో జిల్లాలోని 25 స్కూళ్లు ఉన్నాయి. ఆయా స్కూళ్ల సైన్స్, మ్యాథ్స్ టీచర్లకు కుప్పం సమీపంలోని అగస్త్య క్రియేటివిటీ క్యాంపస్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 4 రోజులు చొప్పున మొత్తం 5 బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 29 వరకు విడతల వారీగా రెసిడెన్షియల్ వర్క్‌షాప్ నిర్వహిస్తారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ)మహేంద్రరెడ్డి తెలిపారు.

సేవలకు పురస్కారం

- ఎస్పీకి డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్న మాధవరెడ్డి



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీసుశాఖలో ప్రతిష్టాత్మకంగా భావించే డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు ఎస్పీ మాధవరెడ్డికి దక్కింది. శనివారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్పీ అవార్డు అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, దిశ కేసుల్లో వేగంగా స్పందించడం తదితర విభాగాల్లో మాధవరెడ్డికి అవార్డు దక్కింది. విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఐపీఎస్‌లకు ఏటా ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు ఇవ్వడం ఆనవాయితీ వస్తోంది. అందులో భాగంగానే ఈ సంవత్సరం పలువురు ఐపీఎస్‌లకు డీజీపీ అవార్డులు అందజేశారు. ఈ క్రమంలోనే ఎస్పీ మాధవరెడ్డి సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కింది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మాధవరెడ్డి శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన మార్కు చూపారు. వివిధ నేరాల్లో నిందితులకు శిక్ష పడేలా చూడటం, శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారు. అలాగే 'దిశ' కేసుల్లో వేగంగా స్పందించి బాధితులకు అండగా నిలిచారు. అలాగే మట్కా, గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు.

ఆపత్కాలంలో ఆర్థిక అండ

బాధిత కుటుంబాలను ఆదుకుంటున్న 'వైఎస్సార్ బీమా'

- పాలసీ అమలు నుంచి తప్పుకున్న ఎల్ఐసీ
- బీమా మొత్తాన్ని ప్రభుత్వమే అందజేస్తున్న వైనం
- 21 రోజుల్లోనే బాధిత కుటుంబం ఖాతాల్లో నగదు
- 6 నెలల్లో 48 మందికి రూ.2.40 కోట్లు అందజేత



నల్లమాడకు చెందిన సాయిలీలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

పుట్టపర్తి అర్బన్ : యజమాని హఠాత్తుగా చనిపోతే బాధిత కుటుంబాల్లో నెలకొనే శోకం అంతాఇంతా కాదు. ఇక ఆర్థిక ఇబ్బందులు చెప్పనలవికావు. ఒక వేళ మృతుడు ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆ కుటుంబానికి ఆర్థిక అండ ఉంటుంది. కార్మికుడో, ప్రైవేటు ఉద్యోగో అయి ఎల్ఐసీ లాంటి సంస్థల్లో జీవిత బీమాపాలసీ చేసి ఉంటే ఆ కుటుంబానికి ఆదరువు దక్కుతుంది. మరి ఏ ఆధారం లేని నిరుపేదలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని యజమాని దూరమైతే బాధిత కుటుంబం పరిస్థితి ఏమిటన్నది ఎవరూ ఊహించలేనిది. కానీ ఇలాంటి వారి కష్టాలనూ సీఎం జగన్ అర్థం చేసుకున్నారు. 'వైఎస్సార్ బీమా' పథకం ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తూ కుటుంబాలను నిలబెడుతున్నారు.

ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వారంతా వైఎస్సార్ బీమా పథకానికి అర్హులే. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. వలంటీర్లే అర్హుల ఇంటి వద్దకు వచ్చి ఈ స్కీమ్‌లో నమోదు చేయిస్తారు. గతంలో వైఎస్సార్ బీమా అమలును లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్ఐసీ) చూసేది. కానీ ఆరు నెలల క్రితం ఎల్ఐసీ వైఎస్సార్ బీమా నుంచి తప్పుకుంది. కానీ పేదలకు పెద్ద ప్రయోజనం చేసే ఈ పథకం ఆగిపోకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. పైగా వైఎస్సార్ బీమా అమలు ఎల్ఐసీ పరిధిలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలకు పరిహారం అందేందుకు నెలలు ఒక్కోసారి ఏడాది పట్టేది. కానీ ప్రభుత్వమే పథకం అమలు చేస్తున్నప్పటి నుంచి 21 రోజుల్లోపే బాధిత కుటుంబాలకు పరిహారం అందుతోంది.

వైఎస్సార్ బీమా లబ్ధి ఇలా...

పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5 లక్షల పరిహారం బాధిత కుటుంబానికి అందజేస్తారు. పాక్షిక అంగవైకల్యం చెందితే రూ.2.5 లక్షలు అందిస్తారు. పాలసీదారు వయస్సు 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండి సహజ మరణం పొందితే రూ. లక్ష ప్రమాద బీమా అందజేస్తారు. అయితే 24 గంటల్లోగా మృతుల వివరాలు, నామినీ వివరాలను సచివాలయ వలంటీర్ ద్వారా అందజేయాల్సి ఉంటుంది. బీమా మొత్తం నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది. బీమా క్లెయిమ్ చేసిన 15 రోజుల్లోగా డబ్బులు వస్తాయి. లబ్ధిదారుడి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తారు.

ఆరు నెలల్లో రూ.2.40 కోట్ల పరిహారం విడుదల

గత ఆరు నెలల కాలంలో జిల్లాలోని 78 మంది వైఎస్సార్ బీమా పాలసీదారులు వివిధ ప్రమాదాల్లో మృతి చెందారు. ఇందులో ఇప్పటికే 48 కుటుంబాలకు వైఎస్సార్ బీమా కింద రూ.2.40 కోట్లు నేరుగా బాధిత కుటుంబీకుల ఖాతాల్లో జమ అయ్యాయి. వారి వివరాలను ఆయా సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి పంపగానే 21 రోజుల్లో బీమా మొత్తం రూ.5 లక్షలు నేరుగా నామినీ ఖాతాల్లో జమ చేశారు.



బత్తలపల్లికి చెందిన వేములేటి ఆదిలక్ష్మికి తక్షణ ఆర్థిక సాయం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

నేరుగా ఖాతాల్లోనే జమ



యజమాని అకస్మాత్తుగా మృతి చెందితే బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకే ప్రభుత్వం 'వైఎస్సార్ బీమా' పథకం అమలు చేస్తోంది. ప్రస్తుతం సచివాలయాల ద్వారా నేరుగా నామినీ ఖాతాకు నగదు చేస్తోంది. దీనివల్ల బాధిత కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోంది. జిల్లాలో గడచిన ఆరు నెలల్లో 78 మంది మృతి చెందగా, ఇప్పటి వరకూ 48 బాధిత కుటుంబాలకు రూ.2.40 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయి. – నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

రూ.5 లక్షలు అకౌంట్‌లో పడ్డాయి



నా భర్త వేములేటి ఆదినారాయణరెడ్డి ఆరు నెలల క్రితం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏ ఆధారం లేని నేను కుటుంబ పోషణ, ఇప్పటికే చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అల్లాడిపోయాను. కానీ ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద నెల తిరగక ముందే రూ.5 లక్షలు నా ఖాతాలో జమ చేసింది. నాలాంటి ఎందరో అక్కా చెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ ఆపత్కాలంలో అండగా నిలుస్తున్నారు.
– వేములేటి ఆదిలక్ష్మి, బత్తలపల్లి

బతకగలనన్న ధీమా వచ్చింది



నా భర్త నాగేంద్ర నాయక్ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో నా పరిస్థితి ప్రశ్నార్థకమైంది. వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చడం తలకుమించిన భారమైంది. 20 రోజుల తర్వాత బ్యాంకుకు వెళ్తే నా అకౌంట్‌లో రూ.5 లక్షలు జమ అయినట్లు అధికారులు తెలిపారు. వివరాలు ఆరా తీస్తే వైఎస్సార్ బీమా పరిహారం అని చెప్పారు. ఇప్పుడు నాకు బతకగలనన్న ధీమా వచ్చింది. ఇక నాకు ఎవరి తోడు అవసరం లేదు.
– సరోజాబాయి, కనగానపల్లి

నెలలోపే డబ్బులందాయి

నా భర్త రామాంజనేయులు కార్పెంటర్‌గా పని చేసేవాడు. 20 రోజుల క్రితం నల్లమాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వృద్ధులైన అత్తా మామలతో పాటు కుటుంబ పోషణ ఎలా అనే ఆందోళన ఉండేది. వలంటీర్, సచివాలయ సిబ్బంది వచ్చి తక్షణ సాయం అందించారు. అలాగే వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయించారు. నెల తిరగకముందే నా ఖాతాలో రూ.5 లక్షలు జమ అయ్యాయి.
– సి.సాయిలీల, నల్లశింగయ్యగారిపల్లి, నల్లమాడ మండలం

కలెక్టరేట్‌లో అవినీతి జలగ!

- తహసీల్దార్లతో ఆయన రూటే సెపరేటు'
- ప్రతి పనికీ చేయి తడపాల్సిందే
- పేదలకు ఇచ్చే భూపంపిణీలోనూ చేతివాటం
- సబ్ డివిజన్‌కు రూ.1.5 కోట్ల వసూలు లక్ష్యం



సాక్షి, పుట్టపర్తి కలెక్టరేట్‌లో పని చేసే ఓ ఉద్యోగి అవినీతి జలగగా మారి పేద ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్నారు. పైసలిస్తే కానీ.. ఫైలు ముందుకు కదలదని తెగేసి చెబుతున్నారు. ఈ క్రమంలో పలువురు ఫిర్యాదులు చేసినా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వమే ఆదేశించినా..

గత టీడీపీ ప్రభుత్వంలో కొన్ని నిబంధనలు వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబంధనలు సడలించారు. అసైన్‌మెంట్ భూమి కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే కలెక్టరేట్‌లోని ఓ అధికారి ఇందుకు విరుద్ధంగా మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ఫలితంగా రైతులకు మళ్లీ పాత కథే గుర్తుకొస్తోంది. ప్రతి మండలం నుంచి నిర్ణయించిన మేరకు సొమ్ములు ఇస్తేనే.. ఫైలు కదులుతుందని తేల్చి చెబుతున్నాడు. దీంతో కొందరు రెవెన్యూ అధికారులు రైతుల నుంచి వసూళ్లు చేసి సదరు అధికారికి ముట్టజెబుతుండగా, అక్కడి నుంచి ఓ ముఖ్య అధికారికి ఆ లంచం వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల అండతోనే సదరు అధికారి జిల్లా కార్యాలయంలోనే కూర్చుని వసూళ్లకు పాల్పడుతున్నారని తెలుస్తోంది.

సబ్ డివిజన్‌కు రూ.1.5 కోట్లు టార్గెట్

జిల్లాలో కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ రెవెన్యూ సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఒక్కో సబ్‌డివిజన్‌కు నుంచి వసూళ్ల టార్గెట్ ఏకంగా రూ.1.5 కోట్లు విధించినట్లు తెలిసింది. అంతేకాకుండా జిల్లాలో భూముల విలువ అధికంగా ఉన్న.. ఏడు మండలాల నుంచి భారీగా నగదు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు రెవెన్యూ ఉద్యోగులే చెబుతున్నారు. ఇదే అదునుగా చాలామంది తహసీల్దార్లు.. పేదలకు ప్రభుత్వం అందజేస్తోన్న భూపంపిణీలో భారీగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా 2004లోపు 20 ఏళ్లు సాగులో ఉన్న రైతులకు భూ యాజమాన్య హక్కులు కల్పించే జీఓను బేఖాతరు చేస్తున్నారు. లంచం ఇస్తే.. కానీ ఫైలు ముందుకు కదలనివ్వడం లేదు. డబ్బులు ఇవ్వని వారి ఫైళ్లపై పలు కొర్రీలు వేస్తే జాప్యం చేస్తున్నారు.

అన్నీ తానై..

కలెక్టరేట్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తోన్న సదరు అధికారి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేతల అండదండలతో అక్రమార్జనే ధ్యేయంగా రెచ్చిపోతున్నారు. అడిగినంత లంచం ఇవ్వని అధికారులపై కూడా సస్పెన్షన్ వేటు వేయించేందుకు కూడా వెనకాడటం లేదని సిబ్బంది చెబుతున్నారు. సదరు అధికారి చేస్తున్న నిర్వాకంపై చాలా మంది తహసీల్దార్ల నుంచి ఫిర్యాదులు అందినా వాటిని కలెక్టర్ వరకు వెళ్లకుండా ఆ అధికారి అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట

- విద్యార్థుల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి
- కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్
- ఆర్ట్స్ కళాశాలలో ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న పోలా భాస్కర్, వీసీ జింకా రంగ జనార్దన

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. విద్యార్థులకు మానసిక, మేథస్సు సంబంధిత అంశాలతో పాటు ఆధ్యాత్మికతనూ పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాలలను ప్రోత్సహించడానికి కళాశాల విద్య తొలిసారిగా 'ప్రజ్ఞ యాన్యువల్ ఫెస్ట్-2023'ను శనివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహించి ఉన్నత విద్యరంగాల్లో మరిన్ని నూతన ఆవిష్కరణలు, సాధించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసించే వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెరగాలంటే కేవలం మౌలిక సదుపాయాలు ఉంటే సరిపోదన్నారు. అందరినీ బాగు చేయాలనే సంకల్పం ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే విద్యార్థిలో సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందన్నారు. తరగతి బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. వీటితో పాటు సామాజిక భావోద్వేగాలను సమతుల్యం చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక 'జాబ్ పోర్టల్' ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వెయ్యి కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జేఎన్‌టీయూ వీసీ జింకా రంగ జనార్దన మాట్లాడుతూ ప్రపంచంలో మనదేశం యువశక్తిగా దూసుకుపోతోందన్నారు. మేథస్సు పరంగా అభివృద్ధి సాధించామని, అయితే మన ఆలోచనలు వాస్తవ రూపంలోకి ముఖ్యంగా వస్తు ఉత్పత్తిలోకి తీసుకురాలేక పోతున్నామని వాపోయారు. కొన్నేళ్లుగా మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెప్పుకుంటున్నామన్నారు. మన ఆలోచనలను పేటెంట్స్‌గా తీసుకొచ్చి వస్తు ఉత్పత్తిలో ప్రగతి సాధిస్తే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. యువత ముందుకొచ్చి జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సైకాలజిస్ట్ వీరేందర్ మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతర వివిధ అంశాల్లో ఎంపికైన 150 మంది విద్యార్థులు, అధ్యాపకులకు కమిషనర్, వీసీ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి, కళాశాల విద్య అధికారి తులసి, ఆర్జేడీలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయడానికి అర్హులైన ఎస్సీ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి అన్నాదొరై శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఏడాది పాటు బోధించడానికి అర్హులైన వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో రెండు ఉపాధ్యాయ, ఒక అధ్యాపక పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఉమ్మడి అనంతపురం జిల్లాల అభ్యర్థులు తమ దరఖాస్తులను అనంతపురం నవోదయ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాలలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9948100343, 8309005097 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎలుగుబంటి మృతి



ఎలుగుబంటి కళేబరం

మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలోని పొలంలో శనివారం ఓ ఎలుగుబంటి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణ మొక్కజొన్న చేనులో ఓ ఎలుగుబంటి సంచరించడాన్ని స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే డివిజన్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక అటవీశాఖ సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా.. అనారోగ్యంతో బాధపడుతున్న భల్లూకం కనీసం నడిచేందుకు కూడా శక్తిలేక పొలంలోనే పడి పోయి ఉంది. దీంతో వారు పుట్టపర్తి కరుణ సొసైటీ డాక్టర్ నరేంద్రరెడ్డి, స్థానిక పశువైద్యశాఖ ఏడీ అమర్‌ను పిలిపించి చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కొద్దిసేపటికే ఎలుగుబంటి మృతి చెందింది. అటవీశాఖ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-1, 2 పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం రూరల్: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్ 1, 2 ప్రిలిమనరీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులైన బీసీ, ఎస్సీ,, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జ్ ఉపసంచాలకులు కుష్బూకొఠారి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 శిక్షణకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వీరికి ఈ నెల 27 నుంచి శిక్షణ తరగతులుంటాయి. అలాగే గ్రూప్-1 శిక్షణకు ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి 5 నుంచి శిక్షణ ఉంటుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బయోడేటాతో పాటు పది, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ నకళ్లతో రెండు పాటోలను జతపరిచి నిర్ణీత గడువులోపు బీసీ స్టడీ కార్యాలయంలో అందజేయాలి.

క్లుప్తంగా

'తమ్ముడి' బరితెగింపు

- దర్జాగా చెరువు స్థలం కబ్జా



చెరువు స్థలాన్ని చదును చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: ఓ టీడీపీ కార్యకర్త బరితెగించాడు. దర్జాగా చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నాడు. పద్ధతి కాదని చెబితే దౌర్జన్యం చేస్తున్నాడు. వివరాలు.. మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకట్రాముడు చెరువు స్థలాన్ని ఆక్రమిస్తున్నాడు. తన పొలంలో కలిసేలా చదును చేస్తున్నాడు. చెరువులో జేసీబీతో కొన్ని రోజులుగా గట్లు వేసుకుంటున్నాడు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో చెరువులో పూడిక తీత పనులు చేయించారు. సమీపంలోని బోరు బావుల్లో భూగర్భ జలం పెరిగేలా చర్యలు చేపట్టారు. అయితే, దౌర్జన్యంగా గుంతలను యంత్రాలతో పూడ్చి వేస్తుండడంతో గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదం చేస్తున్నాడని వాపోయారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుంతలో పడి మహిళ మృతి

లేపాక్షి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న వడ్డోళ్ల బండ గుంతలో పడి మతిస్థిమితం లేని ఓ మహిళ మృతి చెందినట్టు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు. వివరాలు.. శనివారం మధ్యాహ్నం గుంతలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా చేశారు. లేపాక్షి గ్రామానికి చెందిన రత్నమ్మ (45)గా గుర్తించారు. కొంత కాలంగా మతిస్థిమితం లేక అక్కడక్కడా నీరుండే చోట్ల తిరిగేదని తెలిసింది. మృతురాలికి కుమారుడు, కోడలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

తడబడ్డ ఆంధ్రా

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహార్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఆంధ్ర – జార్ఖండ్ జట్ల మధ్య మల్టీడే మ్యాచ్‌లో బ్యాటింగ్ చేపట్టిన ఏపీ జట్టు రెండో రోజే తడబడింది. 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఎస్కే మహమ్మద్ తౌఫిక్ 65, సుశాంత్ 78 (9ఫోర్లు, 1 సిక్సర్) ఎం. అభినవ్ 20 పరుగులు చేశారు. తౌఫిక్, సుశాంత్ 133 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన జార్ఖండ్ జట్టు 73 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 188 పరుగులు చేసింది. విస్తల్ తివారీ 91 పరుగులు (7ఫోర్లు), వివేక్ కుమార్ 69 పరుగులు (7 ఫోర్లు, ఒక సిక్సర్) మంచి భాగస్వామ్యం నెలకొల్పి క్రీజ్‌లో కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి మ్యాచ్‌ను ప్రారంభించారు. రెఫరీగా సంజయ్‌వర్మ వ్యవహరించారు.

సత్వర 'స్పందన'

- పుట్టపర్తి మండలం వీరజిన్నాయపల్లికి చెందిన వనిత గత వారం జరిగిన 'స్పందన'లో వినతి పత్రం అందజేసింది. తన భర్త నరేష్ వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుని వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు భార్య, భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ దంపతులు చక్కగా కాపురం చేసుకుంటున్నారు.
- అదనపు కట్నం కోసం భర్త, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని కదిరికి చెందిన లక్ష్మీదేవి ఇటీవల జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు అదే రోజు లక్ష్మీదేవి, ఆమె భర్తను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మార్పు రాకపోవడంతో కేసు నమోదు చేశారు.

- సమస్యలకు సత్వర పరిష్కారం
- మహిళా వేధింపుల కేసులపై ప్రత్యేక దృష్టి
- 6 నెలల్లో 934 అర్జీలు.. ఇప్పటికే 54 శాతం పరిష్కారం



స్పందనలో అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: సమస్యలు పోలీసులకు తెలియజేయాలంటే గతంలో ప్రజలు భయపడేవారు. పోలీసు స్టేషన్ మెట్లెక్కాలంటేనే హడలెత్తేవారు. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అలాంటి పరిస్థితులను పూర్తిగా దూరం చేసింది. స్నేహపూరిత వాతావరణంలో పోలీసులు విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టింది. తమకు ఎదురయ్యే సమస్యను నేరుగా జిల్లా ఎస్పీకే విన్నవించుకునేలా 'స్పందన' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సావధానంగా వింటూ.. పరిష్కారం చూపుతూ

పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ఎస్పీ మాధవరెడ్డి 'స్పందన' నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే బాధితులతో అర్జీలు స్వీకరిస్తున్నారు. సమస్యను సావధానంగా వింటూ భరోసా కల్పిస్తున్నారు. అర్జీదారుల ఎదుటే సంబంధిత పోలీసు అధికారులతో నేరుగా మాట్లాడుతున్నారు. వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశిస్తున్నారు.

6 నెలల్లో 934 ఫిర్యాదులు..

జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమానికి ప్రతి వారం 40 నుంచి 60 అర్జీలు అందుతున్నాయి. ఈ ఏడాది జూలై నెల నుంచి 934 అర్జీలు రాగా, ఇప్పటికే పోలీసులు 54 శాతం కేసులకు పరిష్కారం చూపారు. కొన్ని అర్జీలకు జిల్లా అధికారులు అక్కడిక్కడే పరిష్కారం చూపారు. సాక్షాత్తూ జిల్లా ఉన్నతాధికారి నుంచే ఆదేశాలు వస్తుండడంతో కింది స్థాయి పోలీసులు కూడా వేగంగా కదులుతున్నారు. బాధితులకు సాంత్వన చేకూరుస్తున్నారు.

జూలై నుంచి వచ్చిన అర్జీలు	
భూ తగాదాలు	392
మహిళా వేధింపులు	235
గొడవలు	66
ప్రమాదాలు	6
మిస్సింగ్	84
దొంగతనాలు	17
ఇతర కేసులు	134

మహిళా వేధింపుల కేసులపై ప్రత్యేక దృష్టి..

'స్పందన'లో అందే మహిళా వేధింపుల కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంబంధిత వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రవర్తన మారకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కాపురాలు చక్కగా సాగేలా చూస్తున్నారు. అంతే కాకుండా మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'దిశా' యాప్‌పైనా పోలీసులు దృష్టి సారించారు. గ్రామాలు, పట్టణాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ యాప్‌ను ఫోన్లలో ఇన్‌స్టల్ చేయిస్తున్నారు. ఫిర్యాదులు అందితే సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తున్నారు.

ప్రతి అర్జీదారుకు న్యాయం

'స్పందన'లో అందే ప్రతి అర్జీకి న్యాయం చేస్తాం. ప్రజలు ఎలాంటి సమస్యనైనా నిర్భయంగా పోలీసులకు తెలియజేయవచ్చు. జిల్లాలో పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలకు సత్వర న్యాయం చేస్తున్నాం. – మాధవరెడ్డి, ఎస్పీ

జనవాక్కు

రైతును చేశారు



కూలి పనులు చేసుకునే మాకు జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన 8వ విడత భూ పంపిణీలో 1.50 ఎకరాల పొలాన్ని అందజేసి నన్ను మహిళా రైతును చేశారు. గతంలో గుడిసెలో జీవనం సాగించేవాళ్లం. సొంతింటి కోసం ఎన్ని సార్లు దరఖాస్తులు ఇచ్చినా అప్పట్లో మాపై ఎవరూ కనికరించలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నా పేరుతో ఇంటి పట్టాను ఇవ్వడమే కాదు. సొంతంగా ఇల్లు కూడా నిర్మించి ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సాకే భవాని, చిగిచెర్ల, ధర్మవరం మండలం

మా కుటుంబానికి రూ.1.64 లక్షల లబ్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మా కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,364పైగా లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా రూ.22,420, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.4,944, జగనన్న అమ్మఒడి రూ. 29 వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.1.07 లక్షలు చొప్పున నగదు అందుకున్నాం. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వివరాలు సేకరించి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నారు. సీఎం వైఎస్ జగనన్న మేలు ఎప్పటికీ మరిచిపోలేను. మళ్లీ ఆయనకే మా ఆశీర్వాదం ఉంటుంది.

– నాగరత్నమ్మ, ఉప్పార్లపల్లి, మడకశిర మండలం

పట్టపగలే రెండిళ్లలో చోరీ

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ శివాలయం వీధిలో శనివారం ఉదయం రెండు ఇళ్లలో చోరీ జరిగింది. బండల వ్యాపారి హాజీవలి ఇంటి తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు 17 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లారు. అలాగే బండల ఫ్యాక్టరీలో పని చేసే కార్మికుడు హుస్సేన్ బాషా ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించిన ఆగంతకులు రూ.25వేలు నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా ఘటనలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

64 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి గోవాకు రైలులో తరలింపు
- గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్



పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు, నిందితుడిని చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైలు మార్గంలో అక్రమంగా రవాణా చేస్తున్న 64 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని జీఆర్పీ సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆర్‌పీఎఫ్ సీఐ బెనయ్యతో కలిసి జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం రాత్రి గుంతకల్లు జంక్షన్‌లోని 7వ ప్లాట్‌ఫారంలో ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో జీఆర్పీ సిబ్బంది గుర్తించి ప్రశ్నించారు. ఆ సమయంలో ఓ వ్యక్తి పారిపోయాడు. రెండో వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో ప్యాక్ చేసిన 64 గంజాయి ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. విచారణలో తన పేరు శిఖి రామ్ ప్రధాన్‌గా నిందితుడు తెలిపాడు. ఒడిశాలోని గంజిమ్ జిల్లా రాయపల్లి నివాసిగా పేర్కొన్నాడు. పరారైన స్నేహితుడి పేరు ప్రఫుల్ శెట్టిగా వివరించాడు. గంజాయి ముఠా సభ్యులు వీరికి సుపారి కింద రూ.15 వేలు ఇచ్చి రైళ్లలో గోవాకు గంజాయి సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో ఇరువురూ గంజాయి ప్యాకెట్లు తరలిస్తూ గుంతకల్లు జంక్షన్‌లో దిగి గోవా వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు 7వ ప్లాట్‌ఫారం పైకి చేరుకుని జీఆర్పీ సిబ్బందికి పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.8.96 లక్షలుగా ఉంటుందని నిర్ధారించారు. పరారీలో ఉన్న ప్రఫుల్ శెట్టి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు జీఆర్పీ సీఐ నగేష్ కుమార్ తెలిపారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఆర్‌పీఎస్‌ఐ మహేంద్ర, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు, కానిస్టేబుళ్లు గాదిలింగ, ప్రకాష్, అలీ, నబీ. పుల్లయ్య, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎం. వీరేష్, ఆర్‌పీఎఫ్‌లు జె.సూరినాయుడు, కేఎస్ వరప్రసాద్‌ను జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరీ ప్రత్యేకంగా అభినందించారు.

23 నుంచి పెనుకొండ బాబయ్య దర్గా ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సజ్జాద్‌బాబా, మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: మహిమాన్విత పెనుకొండ బాబయ్య స్వామి 751వ ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆత్మీయ అతిథిగా శనివారం అనంతపురానికి విచ్చేసిన పెనుకొండ పీఠాధిపతి సజ్జాద్‌బాబా.. నగర మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్‌తో కలసి పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. 23న బాబయ్యస్వామి చదివింపులతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ఆదివారం సాయంత్రం ఆలం కుషాయి జెండాలను ఎక్కించుట, 25న మొదటి గంధం పూజ రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ జరుగుతుందన్నారు. 26న ఖవాలీ పోటీలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, 28న బాబయ్య స్వామి ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 29న సాహెబ్ సజ్జాద్‌వారి తాత హజరత్ మౌలానా మౌల్వి ఖ్వాజా సయ్యద్ షా బాబా జియావుద్దీన్ హుస్సేనీ సహారి పూజ జరుగుతుంది. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైపుల్లాబేగ్, ఐఎంఎం మహబూబ్‌బాషా, మసూద్ బాషా, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నిజాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమామ్, జాకీర్, షబ్బీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్లేసిన ప్రజలనే పీడిస్తున్నారు

- 25 ఏళ్లుగా పరిటాల కుటుంబం ప్రజలకు చేసింది అన్యాయమే
- మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని వివరిస్తే మీడియా వక్రీకరించింది
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: నమ్మి ఓట్లేసిన ప్రజలను పరిటాల కుటుంబం అన్ని విధాలుగా పట్టి పీడిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పాతికేళ్ల కాలంలో పరిటాల కుటుంబం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అయితే నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి ప్రజలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. పరిటాల సునీత శాడిజం కారణంగానే రోడ్ల అభివృద్ధి జరగలేదన్నారు. తాను ఇదే విషయాన్ని స్పష్టంగా చెబితే కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించాయని మండిపడ్డారు. అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న ఆశీస్సులతో నియోజకవర్గంలో 17 వేల ఇళ్లను మంజూరు చేయించుకున్నామన్నారు. మరో 8 వేల ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు గుర్తు చేశారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసేందుకు రూ.150 కోట్లు మంజూరు చేయించామన్నారు. అనంతపురం–తగరకుంట రోడ్డును ఎన్నికల్లోపు పూర్తి చేస్తామన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్ నిర్మాణ పనులు కూడా ఎన్నికల్లోపు ప్రారంభిస్తామన్నారు.

రోడ్ల పాపం సునీతదే

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో 52 రోడ్ల పనులను 2018లో పరిటాల కుటుంబానికి చెందిన ఎస్కేసీ కంపెనీ దక్కించుకుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని 19 రోడ్లకు గాను 16 పూర్తి చేశారని, రాప్తాడు నియోజకవర్గంలో 33 రోడ్లకు గాను మూడు మాత్రమే పూర్తి చేశారన్నారు. పాతికేళ్లు రాజకీయ భిక్ష పెట్టిన రాప్తాడు నియోజకవర్గ ప్రజలపై పరిటాల కుటుంబం చూపిస్తున్న కపట ప్రేమకు ఇంతకన్నా నిదర్శన మేముంటుందన్నారు. ఏవైతే రోడ్లు పెండింగ్‌లో పెట్టారో ఆయా గ్రామాలకు పరిటాల సునీత వచ్చినప్పుడు నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోడ్లు పూర్తి చేసిన తర్వాతనే గ్రామంలోకి కాలు పెట్టాలని చెబుతూ ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిరసన తెలపాలన్నారు. అప్పటికీ రోడ్లు వేయకపోతే ఓటు అనే ఆయుధంతో మరోమారు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.

చచ్చేదాకా ప్రజా సేవలోనే

తాను చచ్చేదాకా రాప్తాడు నియోజకవర్గ ప్రజల సేవలోనే తరిస్తానని ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. దాతల సహకారంతో పాటు వ్యక్తిగత సంపాదనతో అనేక సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ వచ్చామన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు కాలువలు, బోగినేపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు అందించేందుకు కాలువలు తవ్వించామన్నారు. గంగలకుంట, లింగనపల్లి, బొమ్మేపర్తి చెరువులకూ కాలువలు తవ్వించామన్నారు. పాడి రైతులను ఆదుకునేందుకు అమ్మ డెయిరీ ప్రారంభించామన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు అండగా నిలబడ్డామన్నారు. ఆలయాల అభివృద్ధి, చావులు, అనారోగ్యాలు, చదువులు ఇలా ఎవరికి ఏ అవసరమున్నా తమ ముగ్గురు అన్నదమ్ములం అండగా నిలిచామన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ప్రేమతో గెలిపించుకున్నారని, తాను కూడా అంతే ప్రేమతో రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నానన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, నాయకులు కె.ధనుంజయాదవ్, చిట్రా వెంకటేష్, దుగుమర్రి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల దొంగల అరెస్ట్

కూడేరు: రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. మండలంలోని కొర్రకోడులో ఇటీవల తుంపర సేద్యం పరికరాలను దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, తిరుపాల్‌ను శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 స్ప్రింక్లర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తప్పొకరిది... శిక్ష మరొకరికి

- జాతీయ రహదారి నిర్మాణంలో గృహాలు కోల్పోతున్న రోటరీపురంవాసులు
- నివాసాలను రాళ్ల గుట్టగా నమోదు చేసిన వైనం
- నిర్వాసితులకు శాపంగా మారిన బీకేఎస్ రెవెన్యూ అధికారుల నిర్వాకం
- ఆందోళనలో 47 కుటుంబాలు



జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోటరీపురంలో కోల్పోనున్న ఇళ్లు

అనంతపురం అర్బన్: రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదానికి ఏకంగా 47 కుటుంబాలు వీధిన పడుతున్నాయి. గృహాలను నిర్మించుకుని దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా నివాసముంటున్న పేదలకు 40 ఏళ్ల క్రితమే ప్రభుత్వం డి.పట్టాలను మంజూరు చేసింది. తాజాగా ఆ ప్రాంతంలో చేపట్టిన 544డీ జాతీయ రహదారి పనుల్లో 130 పక్కా గృహాలను తొలగించాల్సి వస్తోంది. ఇందులో 47 కుటుంబాలకు మినహామిగిలిన అందరికీ పరిహారం అందుతోంది. దీంతో బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామానికి చెందిన నిర్వాసితుల్లో ఆందోళన నెలకొంది.

రాళ్ల గుట్టగా నమోదు

అనంతపురం రూరల్ మండలం పామురాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గ వరకూ 544–డీ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నిర్మాణ క్రమంలో బీకేఎస్ మండలం రోటరీపురం గ్రామంలో దాదాపు 130 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని గుర్తించారు. ఈ క్రమంలో నేషనల్ హైవే, ఆర్ అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇళ్లను కొలిచి నిర్మాణ విలువను నిర్ధారించారు. అయితే రికార్డులు సిద్ధం చేసే క్రమంలో 130 ఇళ్లలో 47 ఇళ్లకు సంబంధించిన సర్వే నంబర్ 112–2ను రాళ్లగుట్టగా రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. వాస్తవానికి ఈ 47 ఇళ్లలో నివాసముంటున్న వారు 50 ఏళ్ల క్రితమే అక్కడ పక్కా గృహాలు నిర్మించుకున్నారు. 1978లోనే ఈ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ క్రమంలో 1983లో వీరికి డి.పట్టాను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. అయితే పరిహారం ఇచ్చేందుకు సిద్ధం చేసిన రికార్డుల్లో ఈ సర్వే నంబర్‌ను రాళ్లగుట్టగా నమోదు చేయడమే కాక కాక ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ పరిహారం 'సున్న'గా అన్వెర్డ్‌లో పొందుపరిచారు. 2018, 2019లో అవార్డు ప్రదాన సమయంలోనూ అధికారులు తాము చేసిన తప్పిదాన్ని సరిచూసుకోలేదు. దీంతో ఈ 47 ఇళ్లకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

చేతులు కాలాక....

'చేతులు కాలాక, ఆకులు పట్టుకోవడం' అన్న చందంలా మారింది ప్రస్తుతం రెవెన్యూ అధికారుల తీరు. తమ తప్పును తెలుసుకుని సరిదిద్దుకుని మరో మారు నివేదిక సిద్ధం చేసి పంపినా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, జాతీయ రహదారులు (మోర్త్) ఆమోదం తెలపలేదు. 47 ఇళ్లకు తప్ప మిగిలిన నిర్వాసితులకు ఇప్పటికే నిర్ధారించిన కట్టడ విలువకు రెట్టింపు పరిహారాన్ని మంజూరు చేయడమే కాక ఆ మొత్తాన్ని నిర్వాసితుల ఖాతాల్లోకి జమ చేసింది. దీంతో 47 నిర్వాసిత కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సమస్యను ఎలా పరిష్కరించి నిర్వాసితులకు న్యాయం చేయాలనే దానిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కసరత్తు చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



నిర్వాసితులకు పరిహారం మంజూరు విషయంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం. పరిస్థితి మొత్తం నేషనల్ హైవేకు సంబంధించిన స్టేట్, సెంట్రల్ ఆఫీసుకు వివరించాం. వారికి దీనిపై సందేహాలున్నాయి. వాటిని కూడా నివృత్తి చేశాం. ఇదే అంశంపై వచ్చే వారం వారు సమావేశం నిర్వహిస్తున్నారు. సమస్య పరిష్కారమవుతుంది.

– కేతన్‌గార్గ్, అనంతపురం జేసీ